సాక్షి తిరుపతి

బుధవారం । 20 । మార్చి । 2024



ఎంబీయూ వార్షికోత్సవం

మోహన్‌బాబు యూనివర్సిటీలో మంగళవారం అట్టహాసంగా వార్షికోత్సవం నిర్వహించారు. - 8లో



కట్టుదిట్టంగా 'కోడ్'

చంద్రగిరి మండలంలో టీడీపీ నేతలు ఏర్పాటు చేసిన హోర్డింగ్‌లను ఎన్నికల కోడ్ మేరకు అధికారులు తొలగించారు. - 8లో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ బుధవారం(సా)	సహర్ గురువారం(ఉ)
తిరుపతి	6-27	4-57
గూడూరు	6-23	4-53

న్యూస్‌రీల్

మోహన్‌బాబుకు చెవిరెడ్డి శుభాకాంక్షలు



మోహన్‌బాబుకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి, తుడా చైర్మన్ మోహిత్ రెడ్డి

చంద్రగిరి : సినీ నటుడు మంచు మోహన్‌బాబు పుట్టిన రోజును పురస్కరించుకుని ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. మంగళవారం ఎంబీయూలోని మోహన్‌బాబు నివాసానికి వెళ్లి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వేద పండితులు ఆశీర్వచనం అందించారు. ఈ క్రమంలోనే శ్రీ విద్యానికేతన విద్యాసంస్థల సీఈఓ మంచు విష్ణును మోహిత్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

బాధ్యతగా ఎన్నికల విధులు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

తిరుపతి అర్బన్ : సార్వత్రిక ఎన్నికల్లో నోడల్ అధికారులు బాధ్యతగా విధులు నిర్వర్తించాలని కలెక్టర్ లక్ష్మీ శ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రణాళికాబద్ధంగా అందరినీ సమన్వయం చేసుకుంటూ పని చేయాలనిసూచించారు. ఎన్నికల కమిషన్ జారీ చేసిన హ్యాండ్ బుక్‌లో మార్గదర్శకాల మేరకు చిత్తశుద్ధితో విధులు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. సమావేశంలో డీఆర్‌ఓ పెంచల కిషోర్, ఎన్నికల సూపరింటెండెంట్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

'పది' పరీక్షకు 1,073 మంది గైర్హాజరు

తిరుపతి ఎడ్యుకేషన్ : పదో తరగతి పరీక్షల్లో భాగంగా మంగళవారం జిల్లా వ్యాప్తంగా 162 కేంద్రాల్లో నిర్వహించిన సెకెండ్ లాంగ్వేజ్ ఎగ్జామ్‌కు 1,073 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డీఈఓ శేఖర్ తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు జరిగిన పరీక్షకు 27,878 మందికి గాను 26,805 మంది విద్యార్థులు హాజరైనట్లు వెల్లడించారు. బుధవారం ఇంగ్లిష్ పరీక్ష ఉంటుందని వివరించారు.

నేడు డేటా సైన్స్ సెంటర్ ల్యాబ్ ప్రారంభం

తిరుపతి సిటీ : స్థానిక తుమ్మలగుంటలోని నలందనగర్‌లో ఇండియన్ సొసైటీ ఫర్ ప్రాబబిలిటీ అండ్ స్టాటిస్టిక్స్ (ఐఎస్‌పీఎస్) వారు నూతనంగా నిర్మించిన డేటా సైన్స్ సెంటర్ ల్యాబ్‌ను బుధవారం ప్రారంభించనున్నట్లు ఐఎస్‌పీఎస్ ప్రెసిడెంట్ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఆధునిక సమాజంలో డేటా సైన్స్ ప్రధాన భూమిక పోషిస్తోందన్నారు. కార్యక్రమానికి విరకోవ్ పెట్రో కెమికల్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ డైరెక్టర్ ఎం.నారాయణ రెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేయనున్నట్లు వెల్లడించారు.

ఎస్వీయూలో ఘనంగా సోషల్ వర్క్‌డే



సర్టిఫికెట్ అందుకుంటున్న విద్యార్థిని

తిరుపతి సిటీ : ఎస్వీ యూనివర్సిటీలో మంగళవారం ప్రపంచ సోషల్ వర్క్ డేను ఘనంగా నిర్వహించారు. వర్సిటీ పాపులేషన్ స్టడీస్, సోషల్ వర్క్ విభాగాధిపతి టి.చంద్రశేఖరయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ ప్రిన్సిపల్ జి.పద్మనాభం ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఆయన మాట్లాడుతూ మనిషికి మనిషి తోడుగా ఉండాలని, బాధ్యతగా ప్రతి ఒక్కరూ సమాజ సేవ చేయాలని సూచించారు. మానవ సంబంధాలను మెరుగుపరచడంలో భారతీయ సంస్కృతి, జీవన విధానం ప్రధాన భూమిక పోషిస్తున్నాయని వెల్లడించారు. ఈ సందర్భంగా ఎస్వీయూ క్యాంపస్ స్కూల్ విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో కో–ఆర్డినేటర్ సాయి సుజాత, హేమంత్ కుమార్, కేవీ సునీల్ కుమార్, ఎం.రీనా, కోదండరామిరెడ్డి, పార్థసారథి, శివప్ప పాల్గొన్నారు.

పొత్తులు.. పన్నాగాలు!



నలభై ఏళ్ల రాజకీయ అనుభవమంటూ గొప్పలు చెప్పుకునే చంద్రబాబు.. ఏరు దాటాక తెప్ప తగలెట్టడం.. నమ్మించి వంచించడం ఆయన నైజం. అధికారం కోసం ఎవరితో అయినా జట్టు కడతారు. పొత్తుల పేరుతో కూటములు ఏర్పాటు చేస్తారు. తీరా సీట్ల పంపకానికి వచ్చే సరికి నిజ స్వరూపం బయటకు తీస్తారు. దశాబ్దాలుగా తాను పాటించే నయవంచన సిద్ధాంతాన్నే ఆయన పునరావృతం చేశారు. పేరుకు మాత్రం తిరుపతి అసెంబ్లీ టికెట్‌ను జనసేనకు కేటాయించారు. వెంటనే టీడీపీ నేతలను రెచ్చగొట్టి అసమ్మతి గళం విప్పించారు. ఇందుకోసం నాయకుల మధ్య నిర్మొహమాటంగా విభేదాలను సృష్టించారు. గ్లాస్ గుర్తు అభ్యర్థి నాన్ లోకల్ అంటూ సరికొత్త వివాదాన్ని తెర మీదకు తెప్పించారు. ఇదే కోవలోనే సత్యవేడులో సైతం ఆదిమూలానికి టికెట్ ప్రకటించారు. వెనుక నుంచి తమ్ముళ్లను నిరసనలకు దింపేశారు. తాను అనుకున్నది నెరవేర్చుకోవడమే లక్ష్యంగా నైతిక విలువలకు తిలోదకాలిచ్చేశారు.

- తిరుపతిలో జనసేనకు పొగబెడుతున్న బాబు
- టీడీపీ నేతలను ఉసిగొల్పి ఆందోళనలు
- సత్యవేడులో ఆదిమూలంపై తమ్ముళ్లను రెచ్చగొట్టిన అధినేత
- తిరుపతిలో రాజుకున్న లోకల్.. నాన్ లోకల్ వివాదం
- 'ఆరణి' అభ్యర్థిత్వంపై నిరసన

సాక్షి, తిరుపతి : రాష్ట్రంలోనే కీలకమైన తిరుపతి సీటును జనసేనకు కేటాయించడం ఇష్టం లేక చంద్రబాబు టీడీపీ శ్రేణులును రెచ్చగొట్టేశారు. తిరుపతి అభ్యర్థిగా టీడీపీ నేతల్లోనే ఒకరిని జనసేనలోకి పంపి.. వారికే టికెట్ ఇప్పించుకునేందుకు బాబు పథకం రచించినట్లు ప్రచారం సాగుతోంది. పొత్తులో భాగంగా పవన్ కోరినట్టే తిరుపతి టికెట్ జనసేనకు కేటాయించి తాను మాట మీద నిలబడతానని తొలుత అందరినీ నమ్మించారు. బాబు తీసుకున్న నిర్ణయాన్ని పవన్ కూడా ఆహా.. ఓహో అని కొనియాడారు. ఇంతలోనే తిరుపతి టికెట్ తిరిగి టీడీపీ నేతలకే కట్టబెట్టేందుకు చంద్రబాబు తమ వారిని ఉసిగొల్పారు. అందులో భాగంగానే తిరుపతిలో టీడీపీ నేతలు 'లోకల్.. నాన్ లోకల్' అనే వాదనను తెరపైకి తెచ్చారు. పార్టీ నాయకులతో ఆందోళనలు చేయించేందుకు సిద్ధమయ్యారు. స్థానిక జనసేన నాయకులను కూడా కలుపుని రోడ్డుపైకి వచ్చి ర్యాలీలు నిర్వహించాలని నిర్ణయించారు. ఆరణి శ్రీనివాసులు కాకుండా తమలో ఎవరికి టికెట్ ఇచ్చినా పనిచేస్తామని రెండు పార్టీల అధినేతలకు తెలిసేలా కార్యక్రమాలు చేపట్టారు. ఇందులో టీడీపీ నేతలతో పాటు జనసేన శ్రేణులు కలిసి పాల్గొనేలా బాబు స్కెచ్ రూపొందించినట్లు సమాచారం. చంద్రబాబు ఆదేశాల మేరకే టీడీపీ, జనసేన నేతలు తిరుపతిలో ప్రెస్ మీట్లు పెట్టి ఆరణి శ్రీనివాసుల అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకించడం.. ఎల్లో మీడియా, సోషల్ మీడియా ద్వారా విస్తృతంగా ప్రచారం చేయిస్తున్నారు. తాజాగా మంగళవారం స్థానిక టీడీపీ నేతలతో కలిసి మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. తన అభ్యర్థిత్వంపై అధిష్టానం పునరాలోచించుకోవాలని కోరారు. తనకే టికెట్ ఇప్పిస్తామని భరోసా ఇస్తే జనసేనలో అయినా చేసేందుకు సిద్ధమని ఇరు పార్టీల అధినేతలకు స్పష్టంగా సందేశం పంపించారు. అయితే ఎక్కడా పార్టీ ఆదేశాలను ధిక్కరించబోమని సన్నాయి నొక్కులు నొక్కడం గమనార్హం. ఇదిలా ఉంటే.. ఆరణి శ్రీనివాసులు తిరుపతిలో నివాసం కొనుగోలు చేసి మంగళవారం గృహ ప్రవేశం కూడా చేశారు. పార్టీ కార్యాలయం కూడా అందులోనేనని ప్రకటించారు. ఇకపై తిరుపతిలోనే ఉంటానని చెప్పుకొచ్చారు.

శ్రీకాళహస్తి కోసం 'కోలా' పట్టు

పొత్తులో భాగంగా శ్రీకాళహస్తి అసెంబ్లీ సీటును బీజేపీకి కేటాయిస్తారని, అదే జరిగితే తానే అభ్యర్థి అని కోలా ఆనంద్ ఆశగా ఎదురుచూశారు. తన అనుచరులతో ప్రచారం కూడా ప్రారంభించారు. చివరకు బొజ్జల సుధీర్‌రెడ్డి పేరును ప్రకటించడంతో కోలా ఆనంద్ ఖంగుతిన్నారు. పొత్తు పొడిచినప్పటి నుంచి కోలా ఆనంద్ ఢిల్లీలోనే ఉన్నారు. తనకు టికెట్ ఖరారయ్యేంత వరకు ఢిల్లీ వదిలేదని భీష్మించుకున్నట్లు శ్రీకాళహస్తిలో ప్రచారం సాగుతోంది. నోటిఫికేషన్ లోపు కోలా ఆనంద్ అభ్యర్థిగా ప్రకటించుకుని వస్తారని కమలం పార్టీ నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

ఆదిమూలానికి తప్పని సెగ

వైఎస్సార్‌సీపీపై బురద జల్లేందుకు ఆదిమూలాన్ని చంద్రబాబు పావుగా వాడుకున్నారు. చివరకు ఆదిమూలానికి టికెట్ ఇవ్వకపోతే.. జనంలో చులకనవుతామని భావించారు. చెప్పినట్టే ఆదిమూలాన్ని సత్యవేడు టీడీపీ అభ్యర్థిగా ప్రకటించారు. ఆ తర్వాతే అసలు కుట్రలకు తెరతీశారు. అందులో భాగంగా స్థానిక టీడీపీ నేతలను రెచ్చగొట్టి ఆదిమూలానికి వ్యతిరేకంగా ఆందోళనలు, ధర్నాలు చేయాలని సూచించినట్లు విశ్వసనీయ సమాచారం. ఆయన ఆదేశాల మేరకే సత్యవేడులో కొద్ది రోజులుగా టీడీపీ శ్రేణులు వరుసగా ధర్నాలు, ఆందోళనలు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ ఆందోళనలు తారస్థాయికి చేరడంతో చంద్రబాబు మంగళవారం మాజీ ఎమ్మెల్యే హేమలత, ఆమె కుమార్తె డాక్టర్ హెలెన్‌ని అమరావతికి పిలిపించుకున్నారు. అయితే వారి అనుచరుల ద్వారా ఆందోళనలు మాత్రం కొనసాగించమని సూచించినట్లు తెలిసింది. నిరసన సెగను తట్టుకోలేక ఆదిమూలమే స్వచ్ఛందంగా పోటీ నుంచి తప్పుకునేలా ఆందోళనలు కొనసాగించాలని స్పష్టం చేసినట్లు తెలిసింది. ఈ క్రమంలోనే జేడీ రాజశేఖర్‌ని రెబల్ అభ్యర్థిగా పోటీ చేయాలని చంద్రబాబే సూచించినట్లు ప్రచారం జరుగుతోంది. ఆ మేరకే జేడీ రాజశేఖర్ ప్రెస్ మీట్ పెట్టి చంద్రబాబు మాకు దేవుడు.. ఆయన బొమ్మ పెట్టుకునే నామినేషన్ వేసి ప్రచారం చేస్తానని ప్రకటించడం విశేషం.

జనసేనలో అసమ్మతి రాగం

ఆరణి శ్రీనివాసులు అభ్యర్థిత్వంపై జనసేనలోనూ అసమ్మతి రాగం మొదలైంది. ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కిరణ్‌రాయల్ ఇంట్లో మంగళవారం నగరంలోని 50 డివిజన్‌ల జనసేన అధ్యక్షులతో సమావేశం నిర్వహించారు. ఆరణికి సహకరించేది లేదని తీర్మానం చేశారు. డివిజన్ అధ్యక్షులను మార్పులు, చేర్పులు చేస్తున్న ఆరణి తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ నేతలు తెరమీదకు తెచ్చినట్లు నాన్ లోకల్ వద్దు.. లోకల్ అభ్యర్థే ముద్దు అంటూ వెల్లడించారు. పవన్ కల్యాణ్ వద్దే ఈ విషయం తేల్చుకుంటామని కిరణ్ రాయల్ స్పష్టం చేసినట్లు తెలిసింది.

ఎన్నికల నేపథ్యంలో అప్రమత్తం



మాట్లాడుతున్న ఎస్పీ కృష్ణ కాంత్ పటేల్

తిరుపతి క్రైమ్ : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ కృష్ణ కాంత్ పటేల్ ఆదేశించారు. మంగళవారం తిరుపతిలోని పోలీస్ అతిథిగృహంలో జిల్లా సబ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ అక్రమ మద్యం, సారా, గంజాయి రవాణా, విక్రయాలపై ఉక్కు పాదం మోపాలని స్పష్టం చేశారు. ఎన్నికల సందర్భంగా ఎక్కడికక్కడ తనిఖీలు చేపట్టి, మద్యం, నగదు డంప్ చేసిన ప్రాంతాలను గుర్తించి సీజ్ చేయాలన్నారు. అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు కృషి చేయాలని సూచించారు. సరిహద్దు ప్రాంతాల్లో చెక్‌పోస్టుల వద్ద వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని ఆదేశించారు. కర్ణాటక నుంచి మద్యం జిల్లాలోకి రాకుండా పూర్తిగా కట్టడి చేయాలని స్పష్టం చేశారు. సమావేశంలో జిల్లా సబ్ అధికారి రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

స్వగ్రామంలో లక్ష్మీప్రసన్న



గ్రామస్తులతో లక్ష్మీప్రసన్న

ఏర్పేడు: సినీ నటుడు మోహన్ బాబు కుమార్తె నటి లక్ష్మీప్రసన్న మంగళవారం ఏర్పేడు మండలంలోని తమ స్వగ్రామం మోదుగుల పాళెంలో సందడి చేశారు. తండ్రి పుట్టిన రోజును పురస్కరించుకుని తమ కులదైవం నాగాలమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామస్తులతో ఆత్మీయంగా ముచ్చటించారు. పెద్దలు, పిల్లలను పలుకరిస్తూ సందడి చేశారు.

● జల విహారానికి వేళాయె



తిరుమల శ్రీవారి సాలకట్ల తెప్పోత్సవాలకు టీటీడీ సర్వం సిద్ధం చేసింది. కోనేటిరాయుని జల విహారానికి పుష్కరిణిని శోభాయమానంగా తీర్చిదిద్దింది. – తిరుమల

పోలింగ్ కేంద్రాలకు 24 గంటల విద్యుత్

చిత్తూరు కార్పొరేషన్: ఉమ్మడి జిల్లాలోని పోలింగ్ కేంద్రాలకు 24 గంటలు విద్యుత్ సరఫరా అయ్యేలా చూడాలని ట్రాన్స్‌కో ఎస్‌ఈ కృష్ణారెడ్డి సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం ఆయన చిత్తూరు రూరల్ ఈఈ కార్యాలయం నుంచి ఎనర్జీ కార్యదర్శి విజయానందం, ఎస్‌ఈలతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. జిల్లాలో మొత్తం 3,718 పోలింగ్ కేంద్రాలు ఉండగా.. ఏఈలు క్షేత్ర స్థాయిలో వాటిని పరిశీలించి పరిస్థితిని నివేదించాలని సూచించారు. పోలింగ్ రోజు ఎటువంటి అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా జరిగే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. పది పరీక్ష కేంద్రాలకు కూడా విద్యుత్ అంతరాయం లేకుండా సరఫరా చేస్తున్నట్టు వెల్లడించారు. ఈఈ హరి పాల్గొన్నారు.

మంత్రి పెద్దిరెడ్డి సభకు పకడ్బందీ ఏర్పాట్లు



మైదానంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

పిచ్చాటూరు: స్థానిక పీడబ్ల్యూ మైదానంలో ఈ నెల 22వ తేదీన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నిర్వహించనున్న సభకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నారు. మంగళవారం ఈ మేరకు ఏర్పాట్లను వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కేవీ చలపతిరాజు, రాష్ట్ర కార్యదర్శి కేవీ భాస్కర్‌నాయుడు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల ప్రచార సభకు భారీ సంఖ్యలో ప్రజలు తరలిరానున్నట్లు వెల్లడించారు. సభికులు, పార్టీ శ్రేణులు, నేతలు ఇబ్బంది పడకుండా పక్కాగా వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ తొప్పయ్య, మాజీ వైస్ ఎంపీపీ పాల పద్మనాభం, పార్టీ మండల ఉపాధ్యక్షుడు సుబ్రమణ్యం, రమేష్ రాజు, ఎంపీటీసీ సభ్యుడు శోభన్, నాయకులు మోహన్ రెడ్డి, చెంగల్రాయరెడ్డి, సూరిబాబురెడ్డి, విశ్వనాథం, ఏసు, శేఖర్, అబ్రహం, బాబు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు తప్పనిసరి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

తిరుపతి అర్బన్ : ఎన్నికల నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని కలెక్టర్ లక్ష్మీ శ ఆదేశించారు. మంగళారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులకు దిశానిర్దేశం చేశారు. అనంతరం కలెక్టర్ జిల్లా అధికారులతో సమావేశమయ్యారు. ఎంతటి వారైనా ఎన్నికల ప్రవర్తన నియమావళిని పాటించాల్సిందేనని స్పష్టం చేశారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రాంగణాల్లో రాజకీయ ప్రకటనలు, హోర్డింగులు, పోస్టర్లు, బ్యానర్లు పెట్టకూడదన్నారు. ప్రస్తుతం హైవేలు, ప్రధాన రహదారుల పక్కనున్న హోర్డింగ్‌లను సమాన ప్రాతిపదికన అన్ని రాజకీయ పార్టీలకు కేటాయించాలని సూచించారు. బోర్డర్ చెక్ పోస్టులను వెబ్‌కాస్టింగ్ ద్వారా పర్యవేక్షించాలని, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటిస్తూ తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. సి-విజిల్ ద్వారా అందే ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలని సూచించారు. సమావేశంలో డీఆర్‌ఓ పెంచలకిషోర్, నోడల్ అధికారులు ప్రసాద్‌రావు, సూర్యనారాయణ, బాలకొండయ్య, కోదండరామిరెడ్డి పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉన్నాయి. సోమవారం అర్ధరాత్రి వరకు 65,051 మంది స్వామివారిని దర్శించుకున్నారు. శ్రీవారికి హుండీ ద్వారా రూ.4.78 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని వారికి 8 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనమవుతోంది.

బాణసంచా కేంద్రంలో భారీ పేలుడు

- ఆరుగురికి తీవ్ర గాయాలు
- ముగ్గురి పరిస్థితి విషమం
- చెన్నై ఆస్పత్రికి తరలింపు

సూళ్లూరుపేట : మండలంలోని వట్రపాళెం వద్ద బాణ సంచా తయారీ కేంద్రంలో మంగళవారం భారీ పేలుడు సంభవించింది. దీంతో ఆరుగురు కార్మికులకు తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది. వివరాలు.. పట్టణానికి చెందిన అజ్జు, ముజ్జు అనే ఇద్దరు సోదరులు బాణ సంచా తయారీ కేంద్రం నిర్వహిస్తున్నారు. అక్కడ స్థానికులతోపాటు బీహార్‌కు చెందిన కార్మికులు పనిచేస్తున్నారు. ఈ క్రమంలో కార్మికులు నల్లమందుతోపాటు మరో పేలుడు పదార్థాన్ని ఆరు బయట ఎండలో దంచుతుండగా రాపిడికి మంటలు చెలరేగాయి. అవి కాస్తా బాణసంచా గోదాముకు వ్యాపించడంతో భారీ పేలుడు జరిగింది. దీంతో బీహార్‌కు చెందిన శంకర్ చౌదరీ (42), పింకేష్ జాదవ్ (40), రాజ్‌కుమార్ (18), రవి (21), గుండు మండల్ (43), స్థానికులు కందుకూరి శివకుమార్(40) తీవ్రంగా గాయపడ్డారు. వీరిని వెంటనే 108లో స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించి ప్రాథమిక చికిత్స చేయించారు. మెరుగైన వైద్యం కోసం చెన్నై కేఎంసీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అయితే శివకుమార్, రాజ్‌కుమార్, రవి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఆర్‌డీఓ చంద్రముని, డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ మధుబాబు, ఎస్‌ఐ రహీంరెడ్డి, ఎస్‌బీ ఎస్‌ఐ జేపీ శ్రీనివాసులురెడ్డి, ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. బాణ సంచా కేంద్రంలో భద్రతాప్రమాణాలను పాటించని కారణంగా యజమానులు అజ్జు, ముజ్జును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



గాయపడిన వారికి చికిత్స చేస్తున్న వైద్యసిబ్బంది



మంటలు అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది



ఘటనాస్థలంలో పోలీస్, రెవెన్యూ అధికారులు

క్లుప్తంగా

'మినీ అమృత్ సరోవర్'తో భూగర్భ జలాల పెంపు



పనులు పరిశీలిస్తున్న పీడీ శ్రీనివాసప్రసాద్

గూడూరురూరల్ : భూగర్భ జలాలను పెంపొందించేందుకు మినీ అమృత్ సరోవర్ పథకం కింద ఫారంఫాండ్ పనులు చేపడుతున్నట్లు డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్ తెలిపారు. మంగళవారం మండలంలోని కొమ్మనేటూరులో ప్రమీల అనే రైతు పొలంలో ఉపాధి హామీ కింద చేపట్టిన ఫారంఫాండ్ పనులను పరిశీలించారు. పీడీ మాట్లాడుతూ వేసవి నేపథ్యంలో ఉపాధి కూలీలు ఇబ్బంది పడకుండా నీడ, తాగునీటి సౌకర్యం కల్పించాలని సూచించారు. ఫారంఫాండ్ నిర్మించుకోవడం ద్వారా ప్రతి గ్రామంలో భూగర్భ జలాలను పెంచుకోవచ్చన్నారు. మెట్ట పంటలు సాగు చేసుకునేందుకు మరింత వెసులుబాటు ఉంటుందని వివరించారు. అధికారులు చంద్రశేఖరరాజు, పెంచలయ్య పాల్గొన్నారు.

అట్టహాసంగా ఎంబీయూ వార్షికోత్సవం



మోహన్‌లాల్ ను సత్కరిస్తున్న మోహన్ బాబు, మంచు విష్ణు తదితరులు



సన్మానం అందుకున్న ముఖేష్ రిషి దంపతులు

చంద్రగిరి : మండలంలోని మోహన్ బాబు యూనివర్సిటీ (ఎంబీయూ)లో మంగళవారం రాత్రి అట్టహాసంగా వార్షికోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సినీ నటులు మోహన్ లాల్, ముఖేష్ రిషి హాజరయ్యారు. వర్సిటీ చాన్సలర్ మోహన్‌బాబుకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. వేడుకల్లో భాగంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఎంబీయూ ప్రో చాన్సలర్ మంచు విష్ణు కుమార్తె అరియానా ఆలపించిన పాశ్చాత్య సంగీతం అలరించింది. ప్రత్యేకంగా ఆమెను మోహన్ లాల్ అభినందించి ఆశీర్వదించారు. అలాగే మోహన్‌బాబు జీవిత విశేషాలతో మంచు మనోజ్ రూపొందించిన డాక్యుమెంటరీ మన్ననలు అందుకుంది.

విద్యతో ఏదైనా సాధ్యం : మోహన్ లాల్

విద్యను ప్రసన్నం చేసుకుంటే ప్రపంచంలో ఏదైనా సాధించవచ్చునని సినీ నటుడు మోహన్ లాల్ తెలిపారు. మోహన్ బాబు అంటే తనకు ప్రత్యేక గౌరవమని, విద్యాసంస్థను స్థాపించి యూనివర్సిటీ స్థాయికి తీసుకురావడం సాధారణ విషయం కాదని వివరించారు. నటుడు ముఖేష్ రిషి మాట్లాడుతూ ఎంబీయూలో అధ్యాత్మికతతో పాటు ఆహ్లాదకర వాతావరణం ఆకట్టుకుంటోందన్నారు. ఇక్కడి విద్యార్థులు దేశవిదేశాల్లోని ప్రముఖ కంపెనీల్లో ఉద్యోగాలు సాధించారని తెలిపారు. విద్యతో పాటు సంప్రదాయాలను కూడా గౌరవించాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం ఉత్తమ విద్యార్థులకు బంగారు పతకాలను అందించారు.

యువత ఆలోచించాలి
- మోహన్ బాబు

రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో యువత ఆలోచించి తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని ఎంబీయూ చాన్సలర్ మోహన్ బాబు సూచించారు. తిండి లేక పస్తులున్న స్థాయి నుంచి రూ.కోట్ల వేతనాలు అందించే స్థాయికి వచ్చానని తెలిపారు. ఎలాంటి స్వార్థం లేకుండా పేద విద్యార్థులకు ఉచితంగా విద్యనందిస్తున్నట్లు వెల్లడించారు. అధ్యాపకులు, సిబ్బంది సహకారంతోనే విద్యాసంస్థను వర్సిటీ స్థాయికి తీసుకువచ్చినట్లు వివరించారు. అనంతరం కళాకారులను ఘనంగా సత్కరించారు.

జగనన్న వెంటే జనం



మార్వాడీలకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే సంజీవయ్య

నాయుడుపేటటౌన్ : కులమతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంటే జనం నడుస్తున్నారని వైఎస్సార్‌సీపీ సూళ్లూరుపేట ఎమ్మెల్యే అభ్యర్థి కిలివేటి సంజీవయ్య తెలిపారు. మంగళవారం పట్టణంలోని దర్గావీధిలో ఉన్న అపార్ట్‌మెంట్ వద్ద 100 మార్వాడీ కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. వారికి ఎమ్మెల్యే సంజీవయ్య కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ట్రేడ్ యూనియన్ కార్యదర్శి పోట్లాపూడి రాజేష్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి టీడీపీ నేతలు



టీడీపీ నేతలకు వైఎస్సార్‌సీపీ కండువా కప్పుతున్న ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్

గూడూరు రూరల్ : చిల్లకూరుకు చెందిన పలువురు టీడీపీ నేతలు వైఎస్సార్‌సీపీలో మంగళవారం చేరారు. వైఎస్సార్‌సీపీ గూడూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి మేరిగ మురళీధర్ వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలు, మహోన్నత ఆశయాలకు ఆకర్షితులై పెద్దసంఖ్యలో నేతలు, కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరుతున్నట్లు వెల్లడించారు. పార్టీలో చేరిన వారిలో మల్లి రమేష్, శేఖర్, మాధవయ్య, గిరి, నారాయణ, ప్రసాద్ తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మల్లు విజయకుమార్‌రెడ్డి, సచివాలయ కన్వీనర్లు కొట్టు అశోక్, యనమల అనుదీప్, మల్లి శ్రీనివాసులు, కమ్మద్దీన్ పాల్గొన్నారు.



పుంగనూరు : బుల్లెట్ నడుపుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

మీ అభిమానం.. మరువలేం

పుంగనూరు: 'మా కుటుంబంపై మీరు చూపిస్తున్న అభిమానాన్ని ఎప్పటికీ మరువలేం. ఎంతసేవ చేసినా మీ రుణం తీర్చుకోలేం' అని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం మండలంలోని ఏతూరు, పెంచుపల్లెలో బైక్ ర్యాలీ నిర్వహించారు. మంత్రి పెద్దిరెడ్డి బుల్లెట్ నడిపి కార్యకర్తలను ఉత్సాహపరిచారు. తరువాత ప్రచార రథంపై నుంచి ప్రజలకు అభివాదం చేస్తూ.. ఆప్యాయంగా పలకరిస్తూ ముందుకు సాగారు. మంత్రి మాట్లాడుతూ గత 30 ఏళ్లలో జరగని అభివృద్ధిని ఐదేళ్లలో చేసి చూపించామని చెప్పారు. సంక్షేమం, అభివృద్ధి చేపట్టి ప్రస్తుత ఎన్నికల్లో ఓట్లు అడిగేందుకు వెళ్లడం సంతోషంగా ఉందన్నారు. ఇలాంటి నూతన ఒరవడికి శ్రీకారం చుట్టిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రానికి ఎంతో అవసరమన్నారు. చంద్రబాబు పొత్తులతో శాంతి భద్రతలకు భంగం కలుగుతుందని, మతోన్మాదం చెలరేగుతుందని తెలిపారు. వైఎస్సార్‌సీపీని గెలిపించేందుకు ప్రతి ఒక్కరూ ప్రచార కర్తలుగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు కొత్తపల్లె చెంగారెడ్డి, పీకేఎం ఉడా చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్, బోయకొండ ఆలయ చైర్మన్ నాగరాజారెడ్డి, ఏఎంసీ చైర్మన్ అమరనాథరెడ్డి, పార్టీ జిల్లా కార్యదర్శి చంద్రారెడ్డి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కట్టుదిట్టంగా 'కోడ్'

సాక్షి ఎఫెక్ట్..



టీడీపీ నేతలు ఏర్పాటు చేసిన బోర్డును తొలగిస్తున్న అధికారులు

చంద్రగిరి : ఎన్నికల కోడ్‌ను కట్టుదిట్టంగా అమలు చేసేందుకు అధికారులు చర్యలను చేపట్టారు. 'ఇక్కడ ఎన్నికల నిబంధనలు పట్టవా?' శీర్షికతో సాక్షి దిన పత్రికలో మంగళవారం ప్రచురితమైన కథనంపై అధికారులు వెంటనే స్పందించారు. చంద్రగిరి మండలంలోని పలు ప్రాంతాల్లో టీడీపీ నేతలు ఏర్పాటు చేసిన లైటింగ్ బోర్డులను తొలగించారు. అధికారులు మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అమల్లోకి వచ్చిన నిబంధనలను అన్ని రాజకీయ పార్టీలకు తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులలో ఏర్పాటు చేసిన రాజకీయ బోర్డులు, హోర్డింగులు, పోస్టర్లను వెంటనే తొలగించాలని ఆదేశించారు. ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రైవేటు ఆస్తులలో రాజకీయ బోర్డులు, హోర్డింగులు ఏర్పాటు చేసుకోవాలంటే రిటర్నింగ్ అధికారి అనుమతి తీసుకోవాలని సూచించారు.

తమిళ రేషన్ బియ్యం పట్టివేత

తడ: మండలంలోని అక్కంపేట గ్రామంలో అక్రమంగా నిల్వ చేసిన 583 బస్తాల తమిళనాడు రేషన్ బియ్యాన్ని మంగళవారం విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. బియ్యం బస్తాలను తరలించేందుకు యత్నిస్తున్నట్లు సమాచారం అందడంతో తిరుపతి విజిలెన్స్ సీఐ చంద్రశేఖర్‌రావు, తడ సివిల్ సప్లయ్ డీటీ ఓబయ్య, ఎస్ఐ నరసింహారావు దాడి చేశారు. రెండు బైక్‌లు, లారీ, బియ్యం బస్తాలను సీజ్ చేసి డ్రైవర్ వీరవెంకటరావును అదుపులోకి తీసుకున్నారు. బియ్యం నిల్వ చేసిన నిందితుడు ప్రతాప్‌నాయుడు పరారీలో ఉన్నట్లు అధికారులు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

గూడూరురూరల్ : మండలంలోని ఈదలపల్లెకు చెందిన ఇనుకుర్తి సుబ్బయ్య(35) అనే వ్యక్తి ఆత్మహత్యకు యత్నించి ఆస్పత్రిలో చికిత్సపొందుతూ మంగళవారం మృతి చెందాడు. వివరాలు.. ఆర్థిక ఇబ్బందుల కారణంగా సుబ్బయ్య సోమవారం పురుగుల మందు తాగేశాడు. కుటుంబీకులు వెంటనే నెల్లూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మరణించాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మనోజ్‌కుమార్ తెలిపారు.

రూ.4 లక్షల నగదు సీజ్

కుప్పం రూరల్: ఆంధ్ర - కర్ణాటక సరిహద్దు ప్రాంతమైన రాజుపేట రోడ్డు నుంచి ద్విచక్ర వాహనంలో తీసుకెళ్తున్న రూ.4 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు కుప్పం ఆర్డీవో శ్రీనివాసులు తెలిపారు. ఆయన కథనం.. మంగళవారం మండలంలోని రాజుపేట వద్ద ఎన్నికల అధికారులు వాహనాలు తనిఖీ చేస్తుండగా, బగళనత్తం గ్రామానికి చెందిన ప్రభాకర్ ద్విచక్ర వాహనంలో రికార్డులు సక్రమంగా లేకుండా నాలుగు లక్షల రూపాయల నగదును తీసుకెళ్తుండగా గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. స్వాధీనం చేసుకున్న నగదును ఖజానాకు తరలించినట్లు వెల్లడించారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉండడంతో రూ.50 వేలకు మించి నగదును తీసుకెళ్లరాదని పేర్కొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం



ముద్దాయిలు, స్వాధీనం చేసుకున్న మద్యంతో పోలీసులు

గుడుపల్లె: అక్రమంగా తమిళనాడుకు తరలుతున్న కర్ణాటక మద్యాన్ని కారుతో సహా స్వాధీనం చేసుకున్నట్లు కుప్పం డీఎస్పీ శ్రీనాథ్, సీఐ ఈశ్వర్‌రెడ్డి, ఎస్ఐ లక్ష్మీకాంత్ తెలిపారు. వారి కథనం.. కర్ణాటక సరిహద్దులోని బిసానత్తం చెక్‌పోస్టు వద్ద ఎన్నికల విధుల్లో ఇన్‌చార్జ్ అబ్దుల్ రహీం, ఆర్ఐ సత్తార్ ఉండగా.. అదే సమయంలో వేగంగా కారు వచ్చి ఆగింది. ఆపై డ్రైవర్, మరో ఇద్దరు కారు దిగి పారిపోవడంతో అనుమానం వచ్చి కారులో పరిశీలించారు. అందులో ట్రిబుల్ ఎక్స్‌రమ్ 15 కేసులు, బెంగళూరు రమ్ 20 కేసులు ఉన్నాయి. వీటి విలువ రూ.లక్ష పైనే ఉంటుంది. ఈ మేరకు మద్యంతోపాటు కారును స్వాధీనం చేసుకున్నారు. పారిపోయిన వ్యక్తులను కుప్పం రైల్వే స్టేషన్ వద్ద అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడ్డ వారిలో తమిళనాడులోని తిరుపత్తూర్‌కు చెందిన కార్తీక్, మురళి, వెంకటేష్‌గా గుర్తించారు. ఈ మేరకు వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు.